క్లుప్తంగా

బీఈడీ విద్యార్థుల ప్రతిభ


ఆరీఫాబేగం


ఆశా రెహమున్నీ


గణేష్

నెల్లూరు (టౌన్) : అంతర్ యూనివర్సిటీ క్రీడా పోటీలకు ప్రభుత్వ బీఈడీ విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, పీడీ రవీంద్ర తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను కళాశాలలో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా విభాగం బాస్కెట్‌బాల్ జట్టుకు ఆరీఫాబేగం, ఖోఖో జట్టుకు ఆశా రెహమున్నీ, పురుషుల విభాగంలో ఖోఖో జట్టుకు పి.గణేష్‌లు ఎంపికయ్యారన్నారు.

కఠిన చర్యలు తప్పవు


సమావేశం నిర్వహిస్తున్న డీడీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : హాస్టల్స్ నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి అన్నారు. దర్గామిట్టలోని ఆ శాఖ కార్యాలయంలో ఏఎస్‌డబ్ల్యూఓలతో శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టల్స్ నిర్వహణలో పనితీరును మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఏఎస్‌డబ్ల్యూఓలు హజరత్తయ్య, తిరుపతయ్య, రమణయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారికి మండల పూజలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్తలుగా గాలి బాబు నాయుడు– గిరిజ, నంబూరు రవీంద్రకుమార్– జయలక్ష్మి, యాకశిరి నాగశేఖర్– ఇందిర, యాకసిరి ఫణిరాజ్– దేవసేన, ఆకుల కోటేశ్వరరావు– తిరుపతమ్మ దంపతులు వ్యవహరించారు.

వీర్ బాల్ దివస్‌ను నిర్వహించాలి


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరు (టౌన్) : జిల్లాలోని అన్ని పాఠశాలల్లో వీర్ బాల్ దివస్‌ను నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు అశోక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. బాబా జోరవరసింగ్, బాబా ఫతేసింగ్‌ల చరిత్రను విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

నెల్లూరు(సెంట్రల్) : రూరల్ పరిధిలోని ముగ్గురికి సంబంధించి రూ.3 లక్షల సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కులను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

పాఠశాలలకు స్టార్ ర్యాంకింగ్స్

నెల్లూరు(టౌన్) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. అకడమిక్ పరంగా ఫార్మేటివ్ పరీక్ష, పదో తరగతి ఫలితాలను తీసుకుని ర్యాంకింగ్స్ ఇచ్చినట్లు తెలిసింది. మొత్తంగా ఏ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు నాలుగు, ఐదు ర్యాంకుల్లో లేవు.

సీసీల కాసుల వేట

- ఎనిమిదేళ్లుగా తిష్టవేసిన ఇద్దరు అధికారులు
- ప్రతి పనికీ రేటు కట్టి వసూళ్లు
- కమిషనర్‌కు తెలియకుండానే ఆయన పేరుతో దందాలు

నెల్లూరు కార్పొరేషన్‌లో తిరుగులేని అధికారులుగా కమిషనర్ సీసీ (క్యాంప్ క్లర్క్)లు చెలామణి అవుతున్నారు. ప్రతి పనికీ రేటు కట్టి రూ.లక్షలు సంపాదిస్తున్నారు. అధికారికి తెలియకుండానే ఆయన పేరుతో దందాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఐదుగురు అధికారులు మారినా వీరు మాత్రం మారరు. వీరి అవినీతి భాగోతం తీసే కొద్ది వస్తునే ఉంటుంది.


నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం

నెల్లూరు(బారకాసు) : నగర కమిషనర్ వద్ద ఇద్దరు సీసీలు విధులు నిర్వహిస్తున్నారు. వీరు రోజు మార్చి రోజు విధుల్లో ఉంటారు. కమిషనర్‌కు సంబంధించిన కార్యక్రమాలు, మీటింగ్‌లు తదితర విషయాలను నోట్ చేసుకుని తెలియజేయడం వీరి పని. అయితే ఇదే అదనుగా కమిషనర్ పేరు చెప్పి దందాలు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎలా చేస్తారంటే..

కమిషనర్ తన పర్యటనలో ఎక్కడైనా భవన నిర్మాణం అక్రమంగా ఉండడం, నిబంధనలకు విరుద్ధంగా జరగడాన్ని గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశిస్తారు. తరువాత అసలు కథ ప్రారంభమవుతుంది. సీసీలు తమ పాత్రను పోషిస్తారు. ఎవరి భవనానికి సంబంధించి చర్యలు తీసుకోమంటారో సదరు యజమాని ఫోన్ నంబర్ తీసుకుని మరుసటి రోజు కలిసి ఎలాంటి ఇబ్బంది లేకుండా మేము చూసుకుంటామని, అందుకు కొంత మొత్తం చెల్లించాలని బేరమాడుకుంటారు. దీంతో సదరు భవన యజమాని సరే అని సీసీలకు ముడుపులు ముట్టచెబుతారు. ఇలా వేలు కాదు రూ.లక్షల్లో వసూలు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కాంట్రాక్టర్లు చేసిన అభివృద్ధి పనుల బిల్లులకు సంబంధించి కమిషనర్ దగ్గరకు వచ్చిన ఫైల్స్‌ను ముందుగానే సీసీలు చూసి సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి మీ ఫైల్‌పై కమిషనర్ సంతకం పెట్టించబోతున్నామని, మా సంగతేంటని బేరం కుదుర్చుకుంటారు. ఇలా అనేక మంది కాంట్రాక్టర్లలో ఎవరి ఫైల్‌ను ముందు క్లియర్ చేయాలనేది కమిషనర్ చూడరు. దీనిని సీసీలు కంట్రోల్ చేస్తారు. ఇలా వీరు కమిషనర్‌కు తెలియకుండానే ఆయన పేరు చెప్పి తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తూ నెలకు రూ.లక్షలు ఆర్జిస్తున్నారని సమాచారం. వీరికి ప్రభుత్వం ఇచ్చేది రూ.వేలల్లో ఉంటే వీరి అక్రమ సంపాదన రోజుకు సుమారు రూ.50 వేలు.. నెలకు దాదాపు రూ.15 లక్షల వరకు ఉంటుందని కార్యాలయ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు.

పర్యటనల వేళ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఇతర ప్రాంతాలకు కమిషనర్ క్యాంపులను వెళ్తుంటారు. అలాంటి సందర్భంలో కమిషనర్‌కు అయ్యే ఖర్చులు ప్రభుత్వాలే చూసుకుంటాయి. అయితే సీసీలు మాత్రం కమిషనర్ ఖర్చుల నిమిత్తం అంటూ రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలతో పాటు పలువురు కాంట్రాక్టర్ల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల విజయవాడ వరదల సహాయక చర్యల్లో కమిషనర్ పాల్గొన్నారు. అక్కడ దాదాపు వారం నుంచి పది రోజుల పాటు ఉన్నారు. ఇదే అదనుగా సీసీలు పలు విభాగాల అధికారులతో పాటు, కాంట్రాక్టర్లకు ఫోన్‌లు చేసి కమిషనర్ ఖర్చుల నిమిత్తం కొంత మొత్తాన్ని పంపించాలని అడగ్గా వీరంతా నగదు జమ చేశారు. అలాగే కేరళ రాష్ట్రానికి వెళ్లిన సమయంలో కూడా ఇదేలా సీసీలు వ్యవహరించినట్లు తెలుస్తోంది.

బదిలీల సమయంలో..

నగరపాలక సంస్థలో అంతర్గత బదిలీలు, పదోన్నతులు జరుగుతుంటాయి. ఇలాంటి సందర్భంలో సీసీలు తమ తెలివిని ప్రదర్శిస్తుంటారు. బదిలీల్లో ఎవరిని ఎక్కడ నియమించే విషయంలో సీసీలు కమిషనర్‌కు సలహాలు ఇస్తుంటారు. కొత్తగా వచ్చిన కమిషనర్‌కు ఇక్కడి పరిస్థితులపై అవగాహన ఉండదు కాబట్టి సీసీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా నచ్చిన వారితో బేరమాడి కావాల్సిన స్థానానికి బదిలీ చేయించడం, పదోన్నతి ఇప్పించడం చేస్తుంటారు. ఇటీవల జరిగిన ఇద్దరు సూపరింటెండెంట్ల పదోన్నతుల్లో, పలువురు ఆర్ఐ పోస్టుల బదిలీలో సీసీలు రూ.లక్షలు లబ్ధి పొందారనే ప్రచారం జరుగుతోంది.

కమిషనర్లు మారినా వీరు మారరు

నగరపాలక సంస్థలో గత ఎనిమిదేళ్లుగా దాదాపు ఐదుగురు కమిషనర్లు మారారు. అయితే సీసీలు మాత్రం మారడం లేదు. ఎన్‌ఎంసీలో ఉద్యోగులందరికీ స్థానచలనం కలుగుతుందే కానీ సీసీలకు మాత్రం కలగడం లేదు. ఇందుకు కారణం వచ్చిన కమిషనర్లకు మాయమాటలు చెప్పి మంచి పేరు తెచ్చుకుని అక్కడే తిష్ట వేస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్ లాంటి దిగువ స్థాయి వారిని సీసీలుగా నియమించుకోవడం వల్ల నాణ్యమైన సలహాలు ఇవ్వలేకపోతున్నారు. సీసీలు వ్యవహరిస్తున్న తీరుపై కమిషనర్ పూర్తిస్థాయిలో విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని, అనుభవం కలిగిన సీనియర్లను సీసీలుగా నియమించుకుంటే మంచిదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అనిల్‌కు కిలివేటి అభినందన


అనిల్‌ను అభినందిస్తున్న కిలివేటి సంజీవయ్య

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ) సభ్యుడిగా ఎంపికైన మాజీ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్‌ను సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఇస్కాన్‌సిటీ ఉన్న ఆయన నివాసంలో కలిసి సన్మానించారు.

మేయర్ సమావేశం



నెల్లూరు(బారకాసు) : నగర మేయర్ స్రవంతి కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అకౌంట్స్ అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. బిల్లులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేసేలా చూడాలన్నారు. సూపరింటెండెంట్ పద్మజ, విశ్వరత్నం తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్) : పుట్టిన బిడ్డకు షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో టీకాలపై శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. టీకాలు వేయించిన వారిలో వేలల్లో ఒక్కరికి ఏఈఎఫ్ఐ అనే ప్రతికూల ఘటనలు జరగవచ్చన్నారు. అరుదుగా టీకాల అనంతరం జ్వరం, టీకా వేసిన చోట నొప్పి, వాపు రావచ్చన్నారు. అయితే ఇవి మందులు వాడకుండానే రెండు, మూడు రోజుల్లో తగ్గిపోతాయన్నారు. అయితే లక్షలో ఒకరిద్దరికి వాపు, నొప్పి తగ్గదన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం కావచ్చన్నారు. ఇలాంటి వారిని ఆస్పత్రిలో చేర్చి మందులు వాడాల్సి వస్తుందన్నారు. టీకాల వల్ల ఇలా ఏఈఎఫ్ఐకు గురైన వారు ఉంటే 24 గంటల్లోపు డీఐఓ (జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్)కి తెలియజేయాలని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు సూచించారు. జీజీహెచ్, నారాయణ ఆస్పత్రుల్లో ప్రతిరోజూ పుట్టిన పిల్లలకు 24 గంటల్లోపు జీరో డోస్ వ్యాక్సిన్‌లు వేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే పీహెచ్‌సీల్లో సైతం జీరో డోస్ వ్యాక్సిన్లు వేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, ప్రపంచ ఆరోగ్య సంస్థ పోలియో సర్వైలెన్స్ అధికారి డాక్టర్ మౌనిక, ప్రభుత్వ మెడికల్ కళాశాల మైక్రో బయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ అనీల, పెథాలజిస్ట్ కృష్ణమూర్తి, జీజీహెచ్ పీడియాట్రిషియన్ చిరంజీవి, జిల్లా ఫోక్సీ అధ్యక్షురాలు యశోధర, ఐఎంఏ అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి, డెమో అధికారి కనకరత్నం, స్టాటిస్టికల్ ఆఫీసర్ సహన, కోల్డ్ చైల్డ్ ఆఫీసర్ యుగంధర్ పాల్గొన్నారు.

మామిడి బీమాను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నెల్లూరు(సెంట్రల్) : మామిడి పంటకు సంబంధించి బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. ఈ మేరకు పోస్టర్‌ను ఆయన శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. 2024–25కు సంబంధించి మామిడి పంటను సాగు చేసే రైతులు ఈనెల 31లోపు ఎకరానికి రూ.2,250 చెల్లించి బీమా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ జిల్లా అధికారులు సత్యవాణి, సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులతో కఠినంగా వ్యవహరించండి


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

నెల్లూరు(క్రైమ్) : నేరస్తులతో కఠినంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించాలని నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి పోలీస్ అధికారులకు సూచించారు. ఆయన శుక్రవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల పరిష్కారానికి పలు సూచనలు, సలహాలిచ్చారు. నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు, సస్పెక్టెడ్‌ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. క్రిస్మస్, సంక్రాంతి పండగల సందర్భంగా దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

నెల్లూరు (టౌన్) : రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో 46వ మహాసభలకు శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువగళంలో లోకేష్ ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన, జీఓ నంబర్–77 రద్దు తదితర హామీలను అమలు చేయాలని కోరారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైమ్) : సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు దోహదపడుతాయని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా అన్నారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని పూలమార్కెట్ వ్యాపారులకు సీసీ కెమెరాల ఉపయోగాలు, సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. క్రిస్మస్, సంక్రాంతి పండగల వేళ ఊర్లకు వెళ్లేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రతి వ్యాపారి దుకాణాల వద్ద సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ధ్యాన దినోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం) : నెల్లూరు శ్రీరామ చంద్రమిషన్ ఆధ్వర్యంలో శనివారం ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ జోనల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.వెంకటకృష్ణ శుక్రవారం తెలిపారు. పొదలకూరు రోడ్డులోని ధ్యాన మందిరంలో ఉదయం 9, సాయంత్రం 5 గంటలకు హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం ఉంటుందన్నారు.

నేడు వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నగరంలోని నూతన జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు కేక్ కటింగ్, తరువాత ప్రగతి చారిటబుల్ ట్రస్ట్‌లో అన్నదాన కార్యక్రమం ఉంటుంది. పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు.

సిటీ కార్యాలయంలో..

రాంజీనగర్‌లో ఉన్న పార్టీ సిటీ కార్యాలయంలో భారీ కేక్ కటింగ్, రక్తదాన శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మాజీ మంత్రి, పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, పార్టీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొంటారు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్) : తల్లి ఆచూకీ తెలపాలని కుమారుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్ట షాదీమంజిల్ సమీపంలో ముజాహిద్– మొహతాజ్ దంపతులు నివాసం ఉంటున్నారు. ఐదురోజుల కిందట అతని భార్య, తల్లి షబానా మధ్య గొడవ జరిగింది. దీంతో ఆయన భార్యను పుట్టింట్లో వదిలివచ్చాడు. ఈనెల 18న షబానా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె జాడ తెలియరాలేదు. ఈ మేరకు కుమారుడు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా గీతా జయంతి


పాల్గొన్న విద్యార్థులు

నెల్లూరు(బృందావనం) : స్థానిక సుజాతమ్మ కాలనీలో ఉన్న రాధాకృష్ణ ధ్యాన మందిరంలో గీతా జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గీతావైభవ్ ట్రస్ట్ చైర్మన్ నజీర్‌బాషా గురూజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పాల్గొని, భగవద్గీతలోని 40 శ్లోకాల గీతాచాలీసా, 108 శ్లోకాల గీతా అష్టోత్తర శతశ్లోకావళిని కంఠస్థ పారాయణం చేశారు. రామ్‌నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపం నుంచి అష్టలక్ష్మి మందిరం వరకు విద్యార్థులు భగవద్గీత విశిష్టతను వివరిస్తూ నగర సంకీర్తన, ప్రదర్శన చేపట్టారు. బీజేపీ రాష్ట్ర నేత పి.సురేంధర్‌రెడ్డి, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు పాల్గొని, అభినందించారు. అనంతరం నిర్వాహకుడు నజీర్‌బాషా మాట్లాడుతూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు భగవద్గీత ప్రచారం జరగాలన్నారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పీహెచ్‌పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, నరసాపురం ప్రసాద్, దేవరకొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అరిగెపూడికి కళానీరాజనం రేపు


ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం) : జిల్లా కళారంగానికి విశేష సేవలందించిన కళాబంధు అరిగెపూడి విజయకుమార్‌కు పురమందిరంలో ఆదివారం కళానీరాజనం కార్యక్రమాన్ని ఏవీకే ఫౌండేషన్, కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు డ్యాన్స్ మాస్టర్ ఎన్వీ రమణయ్య తెలిపారు. స్థానిక పురమందిరం ప్రాంగణంలో ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సాంస్కృతిక రంగాలతో పాటు, సామాజిక సేవకు సొంత నిధులు వెచ్చించిన అరిగెపూడి విజయకుమార్ ఇటీవల హైదరాబాద్‌లో తుదిశ్వాస విడవడం తీరనిలోటుగా పేర్కొన్నారు. ఆయన్ను స్మరిస్తూ ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు నృత్య ప్రదర్శనలు, పాటలు, డ్యాన్స్ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల కళాకారులు కేతా సుబ్బారావు(77299 42543)ను సంప్రదించాలన్నారు. నిర్వాహకులు పి.అమానుల్లాఖాన్, ఎం.రవీంద్ర, సుబ్బయ్య పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత సంజయ్‌కుమార్ మాట్లాడుతూ అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నేతలు శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, అల్లావుద్దీన్, మోహన్, శ్రీరాములు, గణేష్, సుజాత, సుధీర్, ఇర్ఫాన్, రాజేష్ పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ కార్యాలయాల్లో వార్షిక వేడుకలు


దర్గామిట్టలోని ఎల్ఐసీ సీబీ-1 కార్యాలయంలో..


సీఏబీ కార్యాలయంలో..

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ఎల్‌ఐసీ కార్యాలయాల్లో ఎల్‌ఐసీ ఏఓఐ(ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా) వార్షికోత్సవాన్ని శుక్రవారం జరుపుకున్నారు. దర్గామిట్టలోని ఎల్‌ఐసీ సీబీ బ్రాంచ్–1, బృందావనంలోని సీబీ–2, పూలే విగ్రహం సమీపంలోని సీఏబీ బ్రాంచ్‌లలో ఏజెంట్లు కేక్ కట్ చేసి ఉద్యోగులకు, ఐసీఈయూ నాయకులకు పంచిపెట్టారు. యూనియన్ డివిజనల్ సెక్రటరీ నరసింహారావు మాట్లాడుతూ ఎల్‌ఐసీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. నాయకులు హజరత్‌రెడ్డి, దేవరకొండ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శివయ్య, మేకల నరసింహారావుయాదవ్, రషీద్, రంగారావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్


బాప్టిస్టు చర్చి డొనీహాల్లో..


మంత్రి కార్యాలయంలో..

నెల్లూరు(బృందావనం) : వీఆర్సీ సెంటర్‌లోని బాప్టిస్టు చర్చి డొనీహాల్‌లో సండే స్కూల్ చిన్నారుల ప్రీ క్రిస్మస్ శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. స్కూల్ సూపరింటెండెంట్ కె.నివేదిత ఆధ్వర్యంలో జరిగిన చిన్నారుల సంగీత నృత్య రూపకాలు, స్కిట్లు, నాటికలు అలరించాయి. సంఘ కాపరి రెవరెండ్ కె.శ్యాంసన్, హుల్దా శ్యాంసన్, కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, టీచర్లు నీరజ, ప్రసన్న, మెర్సీ, బ్యూలా, అనిత పాల్గొన్నారు.

➡ నెల్లూరు(సెంట్రల్) : నగరంలోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో ప్రీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి క్యాండిల్స్ వెలిగించారు. నారాయణ సతీమణి రమాదేవి, పలువురు మహిళలు పాల్గొని ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.